**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ.28.05.25** **సమయం.18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1. ప్రజలు కులంతో సంబంధం లేకుండా మంచి విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు పొందుతారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.**

**2. గత రెండు నెలలుగా వడగళ్లు, అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు పెద్ద ఉపశమనం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టానికి పరిహారంగా 51.528 కోట్ల రూపాయలను మంజూరు చేసింది.**

**3. 2025-26 మార్కెటింగ్ సీజన్ లో పద్నాలుగు ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర MSP పెంచడానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.**

**4. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ లో అక్రమాలను విచారిస్తున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఎదుట వచ్చే నెల 5న బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు హాజరు కానున్నారు.**

---

**CM –GURUKULAM**

**కులంతో సంబంధం లేకుండా మంచి విద్య ద్వారా మాత్రమే ప్రజలు సమాజంలో గుర్తింపు పొందుతారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు హైదరాబాద్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగిన గురుకుల అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. దళితులు, గిరిజనులు, బలహీన వర్గాలు తమ ఆత్మన్యూనతా భావాన్ని వదులుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.**

( బైట్ ముఖ్యమంత్రి )

వెనుకబడిన వర్గాలలో ఆత్మవిశ్వాసాన్ని సృష్టించడానికి, విద్యలో ప్రపంచంతో పోటీ పడటానికి ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోనే 59,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని ఆయన గుర్తు చేశారు. మంచి ఉద్యోగాలు సంపాదించడం ద్వారా సంతోషకరమైన జీవితాన్ని గడపడానికి 25 సంవత్సరాల వరకు కష్టపడి పనిచేయాలని ఆయన విద్యార్థులకు ఉద్బోధించారు.

---------------------

<u>**COMPENSATION**</u>

తెలంగాణ రాష్ట్రంలో గత రెండు నెలలుగా కురిసిన అకాల వర్షాలు, వడగళ్ల వానల వల్ల నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఉపశమనం కల్పించింది. పంట నష్టానికి పరిహారంగా 51.528 కోట్ల రూపాయలను మంజూరు చేసింది. వ్యవసాయ శాఖ సమర్పించిన నష్టాల అంచనా నివేదికను బట్టి ఈ నిర్ణయం తీసుకుంది. 36,424 ఎకరాల వరి, 3,266 ఎకరాలలో మొక్కజొన్న, 470 ఎకరాలలో జొన్న, ఇతర పంటలలో పంట నష్టాన్ని అధికారులు గుర్తించారు. ఈ పరిహారం 29 జిల్లాల్లో విస్తరించి ఉన్న 41,361 మంది రైతులకు ప్రయోజనం చేకూరుస్తుంది. మంజూరైన నిధులను అధికారుల సమన్వయంతో బాధిత రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.

--------------------------

**CABINET**

**2025-26 మార్కెటింగ్ సీజన్ లో పద్నాలుగు ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర, MSP పెంపును కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదించింది. ఈ మధ్యాహ్నం న్యూఢిల్లీలో మీడియాతో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ, రైతులు తమ ఉత్పత్తులకు లాభదాయకమైన ధరలను పొందేందుకు ప్రభుత్వం ఖరీఫ్ పంటల MSPని పెంచిందని తెలిపారు.**

**కాగా ఆంధ్రప్రదేశ్‌లో NH(67)పై డిజైన్-బిల్డ్-ఫైనాన్స్-ఆపరేట్-ట్రాన్స్ ఫర్ మోడ్‌లో 3653.10 కోట్ల రూపాయల వ్యయంతో 108.134 కి.మీ పొడవున 4-లేన్ బద్వేల్-నెల్లూరు కారిడార్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆమోదం పొందిన బద్వేల్-నెల్లూరు కారిడార్ ఆంధ్రప్రదేశ్‌లోని మూడు పారిశ్రామిక కారిడార్‌లలోని ముఖ్యమైన నోడ్‌లకు అనుసంధానం కల్పిస్తుందని అశ్విని వైష్ణవ్ తెలిపారు.**

**-----------------------**

**MISS WORLD**

**108 మంది మిస్ వరల్డ్ 2025 పోటీదారులు ఈ రోజు హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో HIV లేదా దృష్టి లోపంతో బాధపడుతున్న పిల్లలతో సహా 200 మందికి పైగా అనాథ పిల్లలకు కరుణ, సంఘీభావాన్ని ప్రదర్శిస్తూ  ముక్తకంఠంతో స్వాగతించారు. మిస్ వరల్డ్ పోటీదారులు HIV పిల్లలతో సంభాషించారు. వారితో కలిసి భోజనం చేశారు. వీరిలో తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పిల్లలు ఉన్నారు. పిల్లల భవిష్యత్తును మార్చడానికి విద్య అత్యంత శక్తివంతమైన సాధనం అని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్, CEO జూలియా మోర్లీ అన్నారు.**

**----------------------------**

## మహబూబ్ నగర్ జిల్లా

తెలంగాణలో సాహితీ చైతన్యం తీసుకువచ్చిన  గొప్ప వ్యక్తి సూరవరం ప్రతాపరెడ్డి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. సురవరం ప్రతాపరెడ్డి జయంతి సందర్భంగా  మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు..

----------------------

## మెదక్ జిల్లా

మెదక్ జిల్లాలో గత ఏడాది కంటే ఎక్కువగా ఈ సంవత్సరం 2 లక్షల వేల పై చిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.  జిల్లాలో 66,133 మంది రైతులకు 501 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. గతంలో కంటే మెరుగ్గా  జిల్లాలో కొనుగోలు ప్రక్రియ నిర్వహించినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని రైతులు ఎవరు అధైర్య పడవద్దని జిల్లా కలెక్టర్ భరోసా కల్పించారు.

---------------------

## హన్మకొండ జిల్లా

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఈరోజు హన్మకొండ జిల్లా గీసుకొండ మండలం అనంతారం గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...రైతులు ఆధునిక వ్యవసాయ విధానంలో ఉత్పత్తి పెంచుకొని ఆదాయం పొందాలని కోరారు.

--------------------

## మహబూబాబాద్ జిల్లా

అకాల వర్షాల నేపథ్యంలో రైతులు ధాన్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల సూచించారు. ఈ సందర్భంగా ఆమె ఆకాశవాణితో మాట్లాడుతూ.... రైతులు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పాలని, లేకపోతే మొలకలు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు.

------------------------

## FISH MEDICINE

హైదరాబాద్ లో మృగశిరకార్తేను పురస్కరించుకుని వచ్చే నెల 8, 9 తేదీలలో అస్తమా, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్న రోగులకు, బత్తిని కుటుంబం చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తుంది. బత్తిని అమర్‌నాథ్ గౌడ్ కుటుంబ సభ్యులు చేప మందును పంపిణీ చేస్తారు. జూన్ 8న ఉదయం 10 గంటల నుండి హైదరాబాద్‌లోని నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప మందు పంపిణీ ప్రారంభమై, 24 గంటల వరకు కొనసాగుతుందని ఈ సందర్భంగా అమర్ నాథ్ తెలిపారు. ప్రసాదం పంపిణీ కోసం మత్స్య శాఖ 1.25 లక్షలకు పైగా చేప పిల్లలను సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటోందని ఆయన వివరించారు.

---------------------------

## KCR

తెలంగాణలోని కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఎదుట బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు వచ్చే నెల 5న హాజరు కానున్నారు. కమిషన్ నోటీసుని చంద్రశేఖర్ రావు అందుకున్నారని, ఆయన తన వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని అందిస్తారని మాజీ ఎంపి బి వినోద్ కుమార్ ధృవీకరించారు. తన మీద మోపిన ఆరోపణలను చంద్రశేఖర్ రావు ఎదుర్కొంటారని, అవిభక్త ఆంధ్రప్రదేశ్ కాలం నాటి చారిత్రక సందర్భంతో పాటు, ప్రాజెక్టు ప్రణాళిక, అమలు

ప్రయోజనాలను ఆయన కమిషన్ కు వివరిస్తారని  మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్ ఈరోజు విలేకరులకు తెలిపారు.

---------------------------

**WEATHER**

రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఈ మేరకు  నారింజ రంగు హెచ్చరిక జారీ చేసింది. అదేవిధంగా నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాలు, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో రానున్న 24 గంటల్లో పలుచోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో అలర్ట్ ప్రకటించారు. గత 24 గంటల్లో జనగాం జిల్లాలో అత్యధికంగా 136 మి.మీ, భద్రాద్రి కొత్తగూడెంలో 121.5 మి.మీ వర్షపాతం నమోదైంది.